•

# కాశీపట్నం చూడరబాబు

"మహాదేవమ్మ గొప్ప తపస్విని దైవసాక్షాత్కారం పొందిన పుణ్యచరిత! పరుల కష్టసుఖాలలో పాలుపంచుకొని వారికి తరుణోపాయం సూచించగల ప్రాజ్ఞి!" అని ప్రజల నమ్మిక.

"ప్రజలలో దైవభక్తిని పెంపొందింపచేయాలన్నదే ఆమె ఆశయం! ఆమెకు స్వార్థ చింతన ఏమాత్రం లేదు. ఎల్లవేళలా ఇతరుల బాగోగుల కొరకు తపించే మనిషి!" అని ఆమె భక్తులు ప్రచారం చేస్తున్నారు.

"ఎవరి ఇష్టదేవతను వారు నిర్మల మనస్సుతోనూ, నిశ్చలభక్తితోనూ ఆరాధిస్తే వారు దైవానుగ్రహం పొందుతారు. అంతేకాదు దైవసాక్షాత్కారం తప్పక లభిస్తుంది" అని మహాదేవమ్మ ప్రబోధిస్తుంది.

ఆమె బోధనలలో గురికుదిరి ఆమె ఆదేశానుసారం నిశ్చల భక్తితో తమ ఇష్టదైవాన్ని ఆరాదించి సాక్షాత్కరింపచేసుకున్నవారున్నారు. దేశంలో పలు ప్రాంతాలలో ఆమె భక్తులున్నారు.

మహాదేవమ్మ వయసు 50 సంవత్సరాలు. ఆమెకు తెలుగు, సంస్కృతం అరవం, హిందీ, ఇంగ్లీషు భాషలు వచ్చు. ఆమె నిరంతరం తపోదీక్షలో వుంటుంది. అయితే ఆమె సన్యాసిని కాదు. కాషాయ వస్త్రాలు ధరించదు. రుద్రాక్షమాలలు వేసుకోదు. చేతిలో తులసిపూసల జపమాల ఉంటుంది. ఆమె సంసార స్త్రీ. ఆమెకు భర్తా పిల్లలూ ఉన్నారు. అయితే ప్రస్తుతం ఆమె వారికి దూరంగా ఆశ్రమంలో దైవధ్యానంలో, తపోదీక్షలో ఉంటోంది. ఆమెకు ఆ ఆశ్రమం రామదాసు కట్టించి యిచ్చేడు.

రామదాసు ప్రముఖ పారిశ్రామికవేత్త. గొప్ప ధార్మికుడు. హనుమద్భక్తుడు.



ఆయన నగరిలో తన ఇష్టదైవం హనుమంతుడికి ఆలయం కట్టించేడు. స్వామికి నిత్యధూపదీప నైవేద్యాలకు, పూజలకు తగిన ఏర్పాట్లు చేసేడు.

ఆయన ఓ పర్యాయం మహాదేవమ్మ గురించి విని ఆమె దర్శనం చేసుకున్నాడు. ఆమె శక్తి సామర్థ్యాలు కళ్లారా చూసేడు. మంత్రోపదేశం పొందేడు. అతనికి ఆమె ప్రభావంతో ఇష్టదైవ సాక్షాత్కారం లభించింది.

ఆమె దైవాంశ సంభూతురాలు. ఎన్నో కఠిన పరీక్షలకు గురిచేసి కాని ఎవరినీ నమ్మదు. ఆమె అనుగ్రహం పొందినవారు కొద్దిమంది మాత్రమే! అటువంటిది ఆమెకు

తమపై అనుగ్రహం కలిగినందుకు ఎంతో సంతోషించేరు రామదాసు అతని భార్య ఆదిలక్ష్మి.

మహాదేవమ్మకు తమ కృతజ్ఞతలు తెలియజేసుకోవాలనుకున్నారు. ఆమె కొరకు ఊరు మొదట్లో నేషనల్ హైవే ప్రక్కన మూడు ఎకరాల స్థలం కొని అందులో అన్ని సదుపాయాలతో చక్కటి ఆశ్రమం కట్టించేరు. విశాలమైన ప్రార్థనా మందిరం, పూజామందిరం, పై ఊర్ల నుండి వచ్చే భక్తుల వసతి కొరకు కాటేజీలు కట్టించేరు. ఆశ్రమం చుట్టూ ఎత్తైన కాంపౌండ్ వాల్ నిర్మించి ఆశ్రమంలో పలురకాల పూలమొక్కలు, పండ్ల చెట్లు నాటించి వాటి సంరక్షణకు పనివారిని నియమించేరు.

ఆశ్రమ ప్రవేశద్వారం వద్ద వరుసగా వినాయకుడు, కుమారస్వామి, శివపార్వతులు, లక్ష్మీనారాయణులు, రామాలయం, హనుమంతుని గుడి కట్టించేరు. వాటికి నిత్యధూప, దీప, నైవేద్య పూజల కొరకు తగు ఏర్పాట్లు చేసేరు. వారికి యితర పారిశ్రామికవేత్తలు, నగరంలోని వ్యాపారప్రముఖులు చేయూతనిచ్చేరు. ఆశ్రమ నిర్వహణకు ఒక కమిటీని నియమించి ఏ లోటూ రాకుండా చూస్తున్నారు.

రోజూ ఆశ్రమానికి వచ్చి పోయే భక్తుల అవసరాల కొరకు ఆ ప్రాంతంలో ఎన్నో దుకాణాలు, హోటళ్లు వెలిసేయి. అక్కడ పెద్ద కాలనీ ఏర్పడింది. టాక్సీస్టాండు, ఆటోస్టాండు తయారయింది. సిటీ బస్సులు ప్రతి పది నిముషాలకూ తిరుగుతున్నాయి.

ప్రార్థనా మందిరంలో భక్తులు మూడు పూటలా ఓంకార మంత్రజపం భజనలు చేస్తున్నారు. మహాదేవమ్మ వారికి ఆధ్యాత్మిక విషయాలు బోధిస్తోంది. భక్తుల మంచిచెడ్డలను వ్యధలను స్వయంగా తెలుసుకొని వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాది. ఆమె ప్రవచనాలు వినడానికి భక్తులు దూరప్రాంతాలనుండి వస్తున్నారు.

మహాదేవమ్మకు ప్రచారం, పబ్లిసిటీ ఏ మాత్రం కిట్టదు. ఆమె తన ఫొటోకాని, ఆశ్రమం ఫొటోలుకాని ఎవరూ తీయకూడదని మొదటే శాసించేరు.ఆమె ఆజ్ఞను అందరూ స్ట్రిక్ట్‌గా పాటిస్తున్నారు. ఆశ్రమంలోనికి ఎవరూ కెమేరాలు, వీడియో కెమేరాలు. ఇతర ప్రచార సాధనాలు తీసుకొని రాకుండా ప్రధాన ద్వారం వద్ద భక్తులను నిశితంగా పరీక్షించి లోనికి పంపుతున్నారు.

రామదాసు కొడుకు రాఘవేంద్ర, కోడలు వైదేహి ఇరువురూ డాక్టర్లే. వారు సుమారు 5 సంవత్సరాలు ఉన్నత వైద్య విద్య కొరకు విదేశాలు పర్యటించి అనుభవం

పొంది వచ్చేరు. వారి కొరకు రామదాసు అన్ని హంగులు, అధునాతన వైద్య పరికరాలు కల నర్సింగ్ హోమ్ నిర్మిస్తున్నారు. నర్సింగ్‌హోమ్ తుది మెరుగులు రాఘవేంద్ర స్వయంగా చూస్తున్నాడు.

వైదేహి కూడ మావగారి వలె గొప్ప భక్తురాలు. ఆమెకు దైవ చింతన బాల్యంలోనే బలపడింది. మహాదేవమ్మ మహిమలు వింది. మావగారు మహాదేవమ్మకు కట్టించి యిచ్చిన ఆశ్రమం చూసింది. వైదేహికి ఆశ్రమం నచ్చింది. అక్కడి ప్రశాంత వాతావరణం ఆమెను ఎంతో ఆహ్లాదపర్చింది. ఆమె అత్తగారి వెంట రోజూ ఆశ్రమానికి వెళ్లి దైవ ప్రార్థనలో పాల్గొంటున్నాది. మహాదేవమ్మ బోధనలు వింటున్నాది. నర్సింగ్‌హోమ్ పని ప్రారంభిస్తే ఆమెకు అసలు లీజర్ దొరకదు. అందువల్ల ఆమె ప్రస్తుతం ఎక్కువ టైమ్ ఆశ్రమంలోనే గడుపుతోంది.

వైదేహి భక్తి భావనకు దైవచింతనకు మహాదేవమ్మ మిక్కిలి సంతోషించింది.

తన కోడలికి కూడా దైవ సాక్షాత్కారం కల్గజేయమని ఆదిలక్ష్మి పదేపదే మహాదేవమ్మను బలవంతం చేస్తోంది. ఆమె మాట కాదనలేక చివరకు తన తపశ్శక్తితో వైదేహికి దైవ సాక్షాత్కారం లభింపజేయడానికి మహాదేవమ్మ అంగీకరించింది. నీ యిష్టదైవం ఎవరో చెప్పు? నా తపశ్శక్తితో నీకు దైవసాక్షాత్కారం కలుగజేస్తాను!" అంది - మహాదేవమ్మ ఓ రోజు వైదేహితో!

ఆమె మాటలకు విస్మయం చెంది వైదేహి.

"నా ఇష్టదేవత రుద్రకాళీ!" అంది వైదేహి చిరునవ్వుతో.

ఆ జగన్మాత రౌద్రరూపం ఎంచుకున్నావేం తల్లీ! సౌమ్య రూపాలు ఎన్నో వుండగా! లలితా పరమేశ్వరి, రాజరాజేశ్వరి..."

"రుద్ర కాళీయే నా ఇష్టదేవత!" అంది వైదేహి దృఢంగా.

"సరే మంచిది! రేపు ఉపవాసముండి రాత్రి 8 గంటలకు శుచిగారా!" అంది మహాదేవమ్మ.

మహాదేవమ్మకు తమ కోడలుపై కల్గిన అనుగ్రహానికి ఎంతో ఆనందించేరు రామదాసు, ఆదిలక్ష్మి, పిన్న వయస్సులోనే వైదేహికి దైవసాక్షాత్కారం కలుగబోతున్న దని వారు సంతోషించి, ఆ శుభవార్త వెంటనే బంధువులకు మిత్రులకు తెలియజేసేరు.

మర్నాడు వారందరూ వైదేహితో ఆశ్రమానికి వచ్చేరు.

సాయంకాల పూజా కార్యక్రమాలన్నీ త్వరగా ముగించింది మహాదేవమ్మ. వైదేహిని తన పూజామందిరంలోనికి తీసుకొని వెళ్లి కూర్చోబెట్టింది. ఇతరులెవరూ లోనికి రాకుండా తలుపులు మూసింది. గదిలో జీరో వాట్ బల్బ్ వెలుగుతోంది.

మహాదేవమ్మ వైదేహికి రుద్రకాళీ మంత్రం ఉపదేశించి జపించమని తనూ ధ్యానంలో కూర్చుంది.

అర్థగంట తరువాత మహాదేవమ్మ వైదేహి వద్దకు వచ్చి ఆమె తలమీద చేయి వుంచి-

"కొద్దిక్షణాలలో నీ ఇష్టదైవం రుద్రకాళీ నీ ముందు ప్రత్యక్షమవబోతోంది. భయంకర ఉగ్రరూపిణి... రుద్రకాళీ రూపం నీ కళ్లముందు కనిపిస్తోంది... ధైర్యంగా ఉండు... ఏ మాత్రం భయపడకు..." అని పదే పదే మెల్లగా సజెషన్స్ ఇస్తోంది.

పది నిముషాలు గడిచాయి.

వైదేహి కూర్చున్న చోటు నుండి దిగ్గున లేచి వెళ్లి తలుపులు తెరచి లైటు వేసింది.

"సారీ! నువ్వెంత ప్రయత్నించినా నన్ను హిప్నటైజ్ చెయ్యలేవు! ఆ విద్యలో నేను ఆరితేరినదాన్ని. అంతేకాదు నా వైద్య ప్రక్రియలో అదొక భాగం తెలుసా? నీ గురించి నీ మహిమల గురించి మా మావగారు నాకు చెప్పినప్పుడే నీమీద నాకు అనుమానం కల్గింది. నీ రహస్యం బయట పెట్టాలనే నేను వచ్చాను. నీ ట్రిక్స్‌తో అమాయకులని మోసగించగలవేమో కాని నాలాంటి వారిని కాదు! మైండిట్" వైదేహి మాటలు తూటాల్లా తగిలి మూర్ఛపోయింది మహాదేవమ్మ.

మిగిలిన వారందరూ షాక్ అయ్యారు.

"కాశీపట్నం సూడరబాబు! కాలభైరడు ఉన్నడు సూడు" అని పాటపాడుతూ ఆశ్రమం గేటు వద్ద తమాషా పెట్టెలో బొమ్మలు చూపెడుతున్న వాడి చుట్టూ పిల్లలు పైసలు చేత పట్టుకొని గుమిగూడేరు.

('ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక', 9 జూన్ 2001) ✪